అతను తడబడుతున్న అడుగులతో బయటికొచ్చి మాధురి గదిలోకి నడిచి తలుపులు లోపల్నించి బోల్ట్‌చేసి లోపల తలుపు గుండా తన గదిలో కొచ్చాడు. మాధురి గాఢంగా నిద్రపోతోంది. తన చేతిలోని ప్యాకెట్ పరుపు కిందకు తోసి నిశ్శబ్దంగా
ఆమె పక్కన పడుకున్నాడతను.

ఆమె నిద్రలోనే అతనివేపు తిరిగి మీదకు వరిగిపోయి పడుకుంది. ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాలు వెచ్చగా తన పెదాలకు తగులుతున్నాయి.

మాధురి నిజంగా అర్జున్ భార్య కాదా! నిజంగా తనను ఒక వారం రోజుల్లో చంపేయాలనుకుంటోందా? ఆమె ముఖం వైపు చూశాడతను. ఎక్కడో ఏదో క్రౌర్యం దాగి వున్నట్లనిపిస్తోంది. అర్జున్ నిజంగా పిచ్చివాడయ్యాడా? అతని భార్య సంగతేమిటి? ఆమె పాత్ర ఏమిటి? ఆమె ఎందుకు తెర వెనక వుండిపోయింది?

మాధురి అతనిని తన మీదకు లాక్కుంటూ కళ్ళు తెరచి చిన్నగా నవ్వింది.

"టైమెంతయింది?" నెమ్మదిగా అడిగిందామె.

"నాలుగవుతోంది....."

అశాంతి మొదలయిందతనికి... జరిగినదంతా మాధురితో చెప్పేస్తే ఆమె రియాక్షన్స్ ఎలా వుంటాయ్? తనెలాగూ ఆమెను చంపలేడు.... ఆమెనే కాదు, ఎవరినీ చంపలేడు. తను 'కిల్లర్' మెంటాలిటీకి చెందినవాడు కాదు. అది కేవలం సినిమాల్లో విలన్స్ తాలూకూ వ్యవహారం . సహదేవ్, విష్ణులాంటి గొరిల్లాల వృత్తి.

మాధురి నగ్న శరీరం మెత్తని నిప్పులా ఒరుసుకుంటోంది.

"సురేష్ ప్లీజ్ కిల్ మీ...."

"ఇందాకా ఆమెతో మాట్లాడాను" అన్నాడతను. మాధురి ఉద్రేకానికి బ్రేక్ పడింది.

"ఎవరితో?" అంది అనుమానంగా.

"అర్జున్ భార్యతో."

ఆమె ముఖంలో వేగంగా మార్పులొచ్చేసినయ్. వేడి తగ్గిపోతోంది. పట్టు సడలిపోతోంది.

"నీ కెక్కడ కనిపించింది?" ఆత్రుతగా అడిగింది.

"నువ్వు నిద్రపోయాక అర్జున్‌తో మాట్లాడాలని నీ గదిలోకెళ్ళాను. అతనక్కడ లేకపోతే గది తలుపు తీసుకుని నడవాలో కెళ్ళేసరికి ఆమె నన్ను చూసి లోపలకు పిలిచింది."

"ఏం మాట్లాడింది?"

"ఇంకో వారం రోజుల్లో మీరే నన్ను చంపేయబోతున్నారట. అందుకని ముందే మిమ్మల్ని చంపేయమని చెప్పింది."

మాధురి తేలిగ్గా నవ్వేసింది.

"ఆమె అర్జున్ భార్య కాదు."

అతనికి మతిపోతోంది.

"కాదా?"

"ఎలా అవుతుంది? అర్జున్ భార్యను నేనయితే."

"మరామె ఎవరు?"

"అర్జున్ మావయ్య కూతురు. అతనిని ప్రేమించి పెళ్ళి చేసుకోవాలని కలలు కంది. తీరా అతనూ నేనూ పెళ్ళి చేసుకునేసరికి కోపం పట్టలేక నన్నెలాగయినా వదిలించుకోవాలని చూస్తోంది. దాని మాటలు పట్టించుకోకు.... ఒకసారి కోపంతో అర్జున్‌కే విషం పెట్టటానికి ప్రయత్నించింది. అంత తిక్క మనిషి"

అతని పెదాలమీద ముద్దు పెట్టుకుని మంచం దిగి డ్రస్ చేసుకుందామె.

అతను ఆమె వంకే చూస్తున్నాడు. అతని మనసంతా గజిబిజి అయిపోయింది. అంతా ఓ క్లిష్టమయిన పజిల్‌గా వుంది. ఏం అర్థం కావటం లేదు.

"మళ్ళీ రాత్రికి వస్తాను....." రహస్యంగా చెప్పి వెళ్ళిపోయిందామె.

ఆ తర్వాత యింక నిద్ర పట్టలేదతనికి. క్షణక్షణానికి భయం పెరుగుతోంది. వీలయినంత త్వరగా తనిక్కడినుంచి తప్పించుకుని బయటపడాలి.

పది గంటలకల్లా విష్ణు వచ్చాడు గదిలోకి.

"పద....ఆఫీసుకెళ్దాం...." అన్నాడు.

ఇద్దరూ కార్లో బయలుదేరారు. కారు ట్రాఫిక్ జంక్షన్ దగ్గర అగింది. ప్రక్కనే ట్రక్‌వేపు చూశాడు సురేష్ . డ్రైవర్ క్యాబిన్‌లోంచి తనవేపే చూస్తున్నాడో వ్యక్తి. అతని ముఖం చూస్తూనే అనుమానం కలిగింది.

ఏదో జరగబోతోందన్న భయం. ట్రాఫిక్ సిగ్నల్ గ్రీన్ అవగానే తన మీద హత్యా ప్రయత్నం జరగవచ్చు. తను అమాంతం కింద పడుకుంటే తప్ప తప్పించుకునే అవకాశం లేదు-సిద్ధంగా వున్నాడు సురేష్.

లారీలోని వ్యక్తి లో కదలిక కనిపించింది.

ట్రాఫిక్ సిగ్నల్ ఎల్లో అయ్యింది. అతను రెప్పవాల్చకుండా చూస్తున్నాడు కూలింగ్‌గ్లాస్‌లోంచి. సిగ్నల్ గ్రీన్ అయింది. లారీ క్యాబిన్‌లోనుంచి రివాల్వర్ బారెల్ కనబడుతోంది.

ఒక్క ఊపుతో ఫ్రంట్ సీట్ క్యాబిన్ సీట్‌కి మధ్య దూరిపోయాడు సురేష్. అప్పుడే కారు ముందుకి దూకింది.

ట్రక్ శరవేగంతో వెళ్ళిపోయింది. బుల్లెట్స్ రెండూ వెనుక సీట్లోకి దిగిపోయినయ్.

విష్ణు ముఖానికి పట్టిన చెమటలు తుడుచుకుని వెనక్కు చూశాడు. సురేష్ లేచి సీటు మీద కూర్చున్నాడు.

"ఇలాంటివి యింకెప్పుడూ జరగవు కదూ?" కోపం అణచుకుంటూ విష్ణునడిగాడు అతను.

విష్ణు అసహనంగా చూశాడు "పది లక్షలు చాలా పెద్ద మొత్తం సురేష్! అది సంపాదించాలంటే చాలా రిస్కులు తీసుకోవాలి. ఊరికే అంత డబ్బు ఎవరూ యివ్వరు."

అతనికి ఋజువయిపోయిందిప్పుడు-తనకు అంత డబ్బెందుకిస్తున్నారో!

కారు ఆఫీస్ చేరుకుంది. ప్రత్యూష తన వెనుకే గదిలో కొచ్చింది. ఆమె పెదాల మీద చిరునవ్వు! ఆమె తులసిని కలుసుకుందా? తులసి ఎలా వుందో - ఊపిరి బిగపట్టి ఆమె వేపు చూడసాగాడు-

"వెరీ గుడ్ మాణింగ్ సర్!"

అతని మనసు కుదుటపడింది. అంటే తులసి క్షేమంగా వుందన్నమాట.

"గుడ్‌మాణింగ్" అన్నాడు.

ఆమె ఆ రోజు అపాయింట్‌మెంట్స్ గురించీ, సంతకాలు చేయాల్సిన ఫైల్స్ గురించి చెప్పింది.

అదే సమయం....

తను తన పరిస్థితంతా ఓ లెటర్ హెడ్‌మీద రాసి, పోలీస్ సహాయం కోసం ప్రత్యూషను పంపించాలి. తను క్షేమంగా యిందులోనుంచి బయటపడాలంటే అదొక్కటే మార్గం. ప్రత్యూష ఒక్కతే తనను రక్షించగలదు. విష్ణు వెనుక గదిలో కెళ్ళిపోయాడు.

వెంటనే లెటర్ తీసుకున్నాడు అతను. దాని మీద త్వరత్వరగా రాయబోతూండగా సహదేవ్ గదిలోకి రావటంతో చటుక్కున ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

ప్రత్యూష వెళ్ళిపోయింది. తన తరఫున అన్నీ సహదేవ్ మాట్లాడుతున్నాడు. మధ్య మధ్యలో తన అభిప్రాయం, సలహా అడుగుతున్నట్లు నటిస్తున్నాడు.

మధ్యాహ్నం రెండు గంటలకు ఆఫీస్ నుంచి బయటపడ్డాడు. భోజనం చేసి తన గదిలో పడుకున్నాడు ఆలోచిస్తూ. కొద్దిసేపటి తర్వాత ఫోన్ మోగసాగింది గదిలో.

"హలో!" అన్నాడు సురేష్.

"హలో సురేష్! నేను కల్పనను మాట్లాడుతున్నాను" ఆత్రుతగా మాట్లాడుతోందామె.

"కల్పనా!" ఆశ్చర్యంగా అడిగాడు.

"ష్! అర్జున్ భార్యను. నిన్న రాత్రి మాట్లాడాము కదా?" రహస్యంగా అందామె.

"ఓ....మీరా?"

"సురేష్! అది నన్ను కూడా చంపేయాలని చూస్తోంది. నువ్వు ఇవ్వాళే ఆ పని పూర్తి చేయాలి- లేకపోతే నిన్నూ, నన్ను కూడా చంపేస్తుంది" ఫోన్ క్లిక్‌మంటూ కట్ అయిపోయింది.

"హలో-హలో-" అని జవాబు రాకపోయేసరికి ఫోన్ పెట్టేశాడు.

కుర్చీలో కూర్చుండిపోయాడతను.

రాన్రాను పరిస్థితులు భయంకరంగా తయారవుతున్నాయి. అర్జున్‌ని ఆ గదిలో బంధించడం, కల్పనా, మాధురిలిద్దరూ నేనంటే నేనే అర్జున్  భార్యనని చెప్పటం-ఒకరి గురించి ఒకరు భయపడటం- అంతా గందరగోళంగా వుంది.

లేచి పచార్లు చేయసాగాడు.

తను ఇవాళ రాత్రికే పారిపోవాలి అంతే! మరో ఆలోచన అనవసరం. ఒకవేళ సెక్యూరిటీగార్డ్సకి దొరికిపోయినా, వాళ్ళచేత కాల్చివేయబడ్డా ఫరవాలేదు.

విష్ణు తలుపులు తెరుచుకుని గదిలోకొచ్చాడు.

"భోజనం తెమ్మంటావా!" అడిగాడతను.

"వద్దు ఆకలి లేదు"

అతను నవ్వి తలుపులు మూసుకుంటూ బయటకు నడిచాడు.

సురేష్ పచార్లు చేస్తూనే వున్నాడు. రాత్రి పదకొండయింది. నిద్ర రావటం లేదు. మనసంతా అలజడితో నిండిపోయింది. అంతా నిశ్శబ్దం. భయంకరమయిన నిశ్శబ్దం.

నెమ్మదిగా మాధురి గది తలుపు తోశాడు అతను. లోపల మాధురి లేదు. ఎర్రని బెడ్‌లైట్ కాంతి చూస్తుంటే వణుకు పుట్టుకొస్తోంది. ఆమె గదిలో నడిచి నడవా వేపున్న తలుపు తెరవబోయాడు.

అప్పుడు వినిపించింది భయంకరమైన ఆర్తనాదం-స్త్రీ గొంతు.....

తలుపు గడమీద చేయి అలానే వుండిపోయింది. రక్తం గడ్డకట్టుకు పోతున్నట్లుంది.

ఎవరిదా గొంతు? తడబడుతున్న అడుగులతో వెనక్కు  తిరిగి తన గదిలోకి నడిచాడ్య అతను. మరుక్షణం భవనమంతా అడుగుల చప్పుడు-వడివడిగా పరుగెడుతున్న చప్పుడు-అస్పష్టంగా ఎవరిదో గొంతు మాట్లాడుతోంది. మగగొంతు....

తన గది తలుపులు తెరవటానికి ప్రయత్నించాడు అతను. బయటనుంచి లాక్ చేయబడి వుంది. సహదేవ్ గొంతు వినబడుతోంది స్పష్టంగా.